లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి


కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో స్థల లభ్యత ఆధారంగా వార్డు అధికారులకు మొక్కలు నాటే లక్ష్యం విధించామన్నారు. లక్ష్యం ప్రకారం ముందుగా గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, నిత్యం నీళ్ళు పోయించడంపై దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానికులను భాగస్వాములను చేయాలని అన్నారు.

పశువుల నుంచి రక్షించడానికి అవసరమున్న చోట ట్రీ గార్డులను ఏర్పాటు చేయించాల న్నారు. ప్రస్తుత వాతావరణ అనుకూలత దృష్టిలో ఉంచుకొని ఎక్కువ సంఖ్యలో మొక్క లు నాటాలన్నారు. మెప్మా ఆర్‌పీల సహకారం తీసుకొని ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, నగర పాలక సంస్థ ఈఈ రామన్, డీఈఈ షాభాజ్, ఏఈ తేజస్విని, మెప్మా టీఎంసీ మౌనిక, సీఓలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, శమంత పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు



పత్తిపాక రిజర్వాయర్‌కు లైన్ క్లియర్

- డీపీఆర్ తయారీకి రూ. 1.10 కోట్లు మంజూరు
- 2.40 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ
- 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు
- మూడు నుంచి ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం
- రెండు పంపు హౌస్‌లతో ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లాతో పాటు కరీంనగర్, జగిత్యాల జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎస్సారెస్పీ ఆయకట్టు భూములను స్థిరీకరించేందుకు ప్రతిపాదించిన శ్రీలక్ష్మీ నరసింహ పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది. ఈ మేరకు డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారీ కోసం కోటి 10 లక్షల రూపా యల నిధులను మంజూరు చేస్తూ ఈ నెల 2వ తేదీన జీవో ఆర్టీ నెంబర్ 154 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. సీడబ్ల్యూసీ నిబంధనలను అను సరించి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని మూడు నుంచి ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే విధంగా ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని పేర్కొ న్నారు. ఆది వారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాకకు ముందే ఉత్తర్వులు వెలువడడం ప్రాధాన్యతను సంత రించుకున్నది.

పత్తిపాక రిజర్వాయర్ పూర్తయితే పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని, కరీంనగర్ జిల్లా కరీంనగర్, చొప్పదండి, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ డి-83 నుంచి డి-94 వరకు గల 2 లక్షల 40 వేల ఎకరాలతోపాటు కొత్తగా 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు దీనిని ప్రతిపాదించారు. ఎస్సారెస్పీ నిండే వరకు ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పత్తిపాక రిజర్వాయర్ తప్పనిసరి అయ్యింది. ఎస్సారెస్పీ నిండినా, నిండక పోయినా గోదావరి నీటిని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పత్తిపాకకు తరలిం చుకుని సాగునీటిని సరఫరా చేస్తే రైతులకు సాగు నీటికి ఢోకా ఉండదని ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనల మేరకు డీపీఆర్‌కు ప్రభుత్వం ఏడాదిన్నర తర్వాత జీవో జారీ చేసింది.

● పత్తిపాకపై రైతుల ఆశలు

పత్తిపాక రిజర్వాయర్‌పై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పత్తిపాక వద్ద ఒక రిజర్వాయర్‌ను నిర్మించి ఎస్సారెస్పీ ఆయకట్టును స్థిరీకరించాలనే ప్రతి పాదన గత ప్రభుత్వ హయాంలోనే ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా శ్రీపాద ఎల్లం పల్లి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోసే విధంగా రూపకల్పన చేశారు. ఆ మేరకు ప్రాజెక్టు పూర్తి చేసి ఎల్లంపల్లి నుంచి నంది మేడారం వద్ద నిర్మించిన పంప్‌హౌస్, రామడుగు మండలం

(మిగతా 8వపేజీలో)

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- కమిషనరేట్ పరిధిలో 193 మంది విముక్తి

కోల్‌సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ 11 విజయవంతమైనట్లు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 193మందిని విముక్తి చేసి 15 మందిపై కేసు నమోదు చేశామన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరానికి రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నామన్నారు. తప్పిపోయిన, వదిలివేసిన వివిధ రకాల బాల కార్మికులు కిరాణం, మెకానిక్ షాపుల్లో హోటళ్లలో వివిధ కంపెనీల్లో పని చేస్తూ, రోడ్డుపై బిక్షాటన చేస్తున్న పిల్లలు బాల కార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించామన్నారు. కొందరిని చిల్డ్రన్‌హోం పంపించామన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, వైద్య శాఖ, వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, 190 మందిలో బాలబాలికలను గుర్తించి బాలకార్మికులను విముక్తి చేసి పాఠశాలలో చేర్పించామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలలను పనిలో పెట్టుకున్నా, ఎక్కడైనా పని చేసిన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేయాలని లేదా 100కు కాల్ చేయాలని సూచించారు. బాల కార్మికులను పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేసిన వారందరిని ఆయన అభినందించారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో సౌకర్యాలు మెరుగు పరచాలి



ఈఎస్‌ఐ డాక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అహ్మద్‌బాబా

జ్యోతినగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో సౌకర్యాలు మెరుగు పర్చాలని జిల్లా అసంఘటిత రంగ కార్మిక సంఘం(కాంగ్రెస్) అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాబా కోరారు. సోమవారం డిస్పెన్సరీలో వైద్యురాలు గాయత్రి దేవిని కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వేలాది మంది అసంఘటిత కార్మికులు ఇక్కడ పని చేస్తుండగా నామమాత్రపు సిబ్బంతో డిస్పెన్సరీని నడుపుతున్నారన్నారు. 10 వేల మంది ఐపీ(ఓపీ) ఉంటే డబుల్ షిఫ్ట్ డిస్పెన్సరీగా మార్చాల్సి ఉంటుందని, 6గురు మెడికల్ ఆఫీసర్లు ఉండాలని, 4గురు నర్సింగ్ స్టాఫ్, 6గురు ఫార్మసిస్టులుండాలన్నారు. అన్ని అర్హతులున్నప్పటికీ అప్‌గ్రేడ్ చేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పట్టణానికి చెందిన పర్వీన్ తన భర్త కుద్బోద్దీన్‌కు ఇటీవలే ప్రమాదంలో కాలు తొలగించారని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో వాచ్‌ఉమన్ పోస్ట్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకొంది. ఈ మేరకు వారధికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పోచమ్మ కాలనీకి చెందిన జి.రమేష్ దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా డీఆర్‌డీఏ పీడీకి రాశారు. నంది మేడారం గోపాల్ రావుపేట గ్రామాలకు చెందిన రైతులు గోలివాడ నుంచి గోపాలరావు పేట వరకు ఉన్న రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని పూర్తి చేయాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాశారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిల్ల శివారులో 420 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన కంజు కుమార్ కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడని మాజీ ఉపసర్పంచ్ దాసరి రమేష్ సోమవారం ప్రజావాణిలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 26న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేసినా సదరు భూమి తనదేనంటూ కబ్జా చేశాడని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముంజాల హరికృష్ణగౌడ్, కడారి నవీన్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పీఆర్‌సీ గడువు ముగిసి రెండు సంవత్సరాలు గడిచినా నివేదిక వెలువరించలేదన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి ఆమోదయోగ్యమైన ఫిట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పదవి విరమణ ఉద్యోగుల బెనిఫిట్స్, జీపీఎఫ్ లోన్స్ సీపీఎస్, డీఏ ఎరియర్స్, ఫైనల్ పేమెంట్స్, సరెండర్ లీవ్స్ బిల్లులను రిలీజ్ చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై వచ్చే నెల 1న హైదరాబాద్ ఇందిరా పార్కులో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు అందించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అనుముల పోచయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ఆకుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సదయ్య, గండె శ్రీకాంత్, నారాయణ పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాద బాధితులకు సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావు శివపల్లిలోని ఆయన స్వగృహంలో చెక్కులు అందజేశారు. పెగడపల్లి గ్రామానికి చెందిన నక్కల రవి విద్యుదాఘాతంతో మృతి చెందగా రూ.5 లక్షల నష్టపరిహారం అందించారు. కూనారం చెందిన సుద్దాల శ్రీనివాస్, ఎదులాపూర్ గ్రామానికి చెందిన పాణికల కనకయ్య ఎద్దులు మృతి చెందగా ఒక్కొక్కరికి రూ.40 వేల చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సదయ్య, మూల ప్రేంసాగర్ రెడ్డి, కల్లెపల్లి జానీ పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఓదెల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు సోమవారం మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి పెద్ద ఎత్తున నిర్వహించే మహాధర్నాకు మండలం నుంచి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, కందుల సదాశివ, అల్లం సతీష్, సామ శంకర్, తాడూరి శ్రీమాన్, వీర్ల చందు, సదయ్య, సమ్మయ్య, జంగం కొమురయ్య తరలి వెళ్లారు.



కమలంలో కలహాలు

- జిల్లాలో బీజేపీ గాడిన పడేనా!
- వర్గ విభేదాలతో సతమతం
- అయోమయంలో పార్టీ కార్యకర్తలు
- నేడు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

భారతీయ జనతా పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలు, నేతల ఒంటెత్తు పోకడలతో క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. కొంత కాలంగా రాష్ట్ర స్థాయి నాయకత్వం జిల్లాపై దృష్టి సారించక పోవడంతో ఇక్కడి పార్టీ నేతలది ఆడిందే ఆట, పాడిందే పాటలా మారిందనే అభిప్రాయం కార్యకర్తల్లో ఏర్పడింది. నెల రోజుల క్రితం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్ రాంచందర్ రావుపై ఇక్కడి నాయకులు, కార్యకర్తలు పార్టీని గాడిన పెడతారనే ఆశలు పెంచుకున్నారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలో నిర్వహించనున్న బీజేపీ కార్యకర్తల సమ్మేళనానికి ఆయన హాజరవుతున్నారు. ఆయన రాక కోసం పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశారు. సుల్తానాబాద్‌లో ఆయనకు స్వాగతం పలికి పెద్దపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు ఎన్ఆర్ఐ నల్ల మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా తన అనుచరులతో బీజేపీలో చేరనున్నారు. జిల్లాలోని పార్టీలో నెలకొన్న పరిస్థితులపై కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. రెండో స్థానంలో బీఆర్ఎస్ నిలువగా బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వలేకపోయారు. అనంతరం 2024 మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలబడ్డప్పటికీ, పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేటప్పటికీ పార్టీ పుంజుకున్నది. కానీ ఆ గాలిని కాపాడుకోలేక పోతున్నది. పెద్దపల్లి నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ వర్గాలు ఎవరికి వారుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పార్టీ పదవుల విషయంలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నారు. పదవులు ప్రకటించినప్పుడు ఆయా వర్గాలు ప్రెస్ మీట్లు పెట్టి విమర్శలకు దిగుతున్నారు. దీంతో ఆయా వర్గాలకు దూరంగా ఉన్న బీజేపీ కార్యకర్తలు, అభిమానులు ఇబ్బందులు పడుతున్నారు. పార్టీ బలోపేతం కంటే వర్గ పోరుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మంథని నియోజకవర్గంలో కూడా ఇటీవల విభేదాలు రచ్చకెక్కాయి. అక్కడి నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రుపట్ల సునీల్ రెడ్డి పార్టీ బలోపేతానికి పాటు పడడం లేదని, ప్రభు త్వ వైఫల్యాలను ఎండగట్టడం లేదని, ప్రజా సమస్య లపై పోరాటం చేయడం లేదని, ఆ నియోజక వర్గానికి చెందిన నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. ఇటీవల జిల్లా అధ్యక్షుడు సంజీవ్ రెడ్డితో భేటీ అయి సునీల్ రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జీ పదవి నుంచి తప్పించాలని విన్నవించడం గమనార్హం. రామగుండం నియోజకవర్గంలో కూడా ఇన్‌చార్జీ కందుల సంధ్యా రాణికి పాత బీజేపీ నేతలతో పొసగడం లేదు. అక్కడ కూడా పార్టీ కార్యక్రమాలు అందరి నేతల సమన్వ యంతో సాగడం లేదు. త్వరలో జరగనున్న సంస్థా గత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నా యం తామేనని రాష్ట్ర బీజేపీ నాయకత్వం గొప్పలకు పోతున్నప్పటికీ, జిల్లాలో మాత్రం పార్టీ నాయకుల మధ్య సమన్వయం లేకుండా పోతున్నది. జిల్లా అధ్యక్షులు ఎవరు వచ్చినా కూడా పరిస్థితిలో మార్పు లేదు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సం క్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో బీజేపీ జిల్లా నాయకత్వం విఫలం అవుతుందనే అభిప్రాయాలు సొంత పార్టీ కార్యకర్తల్లోనే నెలకొన్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపై దృష్టిని సారించి నేతల మధ్య వర్గ విభేదాలకు తావు లేకుండా పార్టీని గాడిన పెట్టి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీని సన్నద్ధం చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

ఇసుక మాఫియా...

- గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమ రవాణా
- సంజయ్‌గాంధీనగర్‌లో భారీ డంప్‌లు...
- ఎక్స్‌కావేటర్లతో రాత్రి పూట లోడింగ్
- ఎస్కార్ట్‌ల పహారాలో తరలింపు
- ట్రాక్టర్ల యాజమాని అయిన చోటా నాయకుడి బడా దందా..

8



ఎక్సావేటర్‌తో లారీలో ఇసుకను లోడింగ్

మోడల్ స్కూల్‌లో ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు

అంతర్గాం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో గల ఖాళీలను స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఈ నెల 5 నుండి 15వరకు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, టీసీ ఫోటోలతో దరఖాస్తు చేసుకుని సీట్లు పొందాలని సూచించారు. వివరాలకు మోడల్ స్కూల్ లింగాపూర్‌ను సంప్రదించి ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు.

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం



సమావేశంలో పాల్గొన్న బీసీ ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అత్యధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గ ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐకమత్యంతో సాధించుకుందామని సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఎన్‌సీఓఏ క్లబ్‌లో ఆర్జీ-2 ఏరియా బీసీ ఉద్యోగుల సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఉన్న బీసీలకు చట్టబద్ధంగా దక్కాల్సిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంక్‌గా భావించే రోజులు పోయాయని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతమైనట్టు పేర్కొన్నారు. సింగరేణిలో బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పార్టీలు, కార్మిక సంఘాలకు సంబంధం లేకుండా కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉన్నట్టు నాయకులు అభిప్రాయపడ్డారు. ఇతర సామాజిక వర్గాలు అసోసియన్లుగా ఆయా వర్గాలు ప్రయోజనం పొందుతున్నాయని తెలిపారు. విస్తృత ప్రయోజనాలు పొందాలంటే సంఘటితంగా నిలవాలని, రానున్న రోజుల్లో అసోసియేషన్ బలోపేతం చేసుకుంటూ చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలు పొందే దిశగా ఉద్యోగులు కలిసి రావాలని అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళి, నాయకులు, ఉద్యోగులు మురళీకృష్ణ, జిగురు రవీందర్, అయిలి శ్రీనివాస్, సాలిగామ మల్లేష్, రవికిరణ్, సంపత్, నరేష్ పాల్గొన్నారు.

పర్యావరణ హితం నానో యూరియా

- నేల, గాలి, నీటి కాలుష్యం నివారణ
- చీడపీడలు, తెగుళ్ళు ఉధృతికి చెక్
- సంకట హరణ బీమా పాలసీ వర్తింపు
- వాడకాన్ని పెంచడానికి రైతులకు అవగాహన

6

ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబా

6



అప్పు చెల్లించడం లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగితే చంపుతానని బెదిరించడంతో మనస్థాపానికి గురైన ఓవ్యక్తి సెల్ఫీవీడియోతీసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ తనవద్ద ఉన్న రూ.25లక్షలను వనం హరీష్ అనే వ్యాపారికి ఏడాదిన్నర క్రితం అప్పుగా ఇచ్చాడు. అప్పటినుంచి ఇప్పటివరకు డబ్బుల కోసం కృష్ణ, హరీష్ ఇంటికి వెళ్లి అడుగుతున్నా ఇవ్వడం లేదు. ఈ క్రమంలో కృష్ణ తన డబ్బులు తనకు ఇవ్వాలని హరీష్‌ను మరోసారి అడగగా హరీష్ ఇష్టానుసారంగా దూషించాడు. దీంతో మనస్థాపానికి గురై హైస్కూల్‌గ్రౌండ్‌లో సెల్ఫీ వీడియోతీసి గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కృష్ణను మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


కోట లింగయ్య(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట గ్రామానికి చెందిన కోట లింగయ్య(55) తాటిచెట్టుపై నుంచి పడగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కులవృత్తిలో భాగంగా సోమవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ జారి కిందపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


ఆదిరెడ్డి (ఫైల్)

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లారీలు నడుపుకునే వ్యాపారంలో నష్టాలు చవిచూడడంతో మల్యాలకు చెందిన ముకుందు ఆదిరెడ్డి అలియాస్ డ్రైవర్‌రెడ్డి (59) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిరెడ్డికి లారీలు ఉండగా కొన్నాళ్లుగా నష్టాలు రావడంతో మానసికంగా బాధ పడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వేకువ జామున భార్య చూడగా వెంటనే కుటుంబసభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు విక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తీవ్రగాయాలై చికిత్సపొందుతున్న గర్వందుల శ్రీహరి గౌడ్(64) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన శ్రీహరిగౌడ్ శనివారం జగిత్యాలకు ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా లింగంపేట చౌరస్తాలో కిందపడి పోగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు శ్రీహరి గౌడ్ భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ వేగవంతం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బుట్టిరాజారాం కాలనీకి చెందిన ఐలవేని సంపత్(45) మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. సంపత్ జూలై 29న ఒక విందుకు హాజరయ్యేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈనెల1న బొమ్మకల్ ప్రకృతి ఆసుపత్రి సమీపంలో రోడ్డుపక్కన చెట్లపొదల మధ్యన కుళ్లిన స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సంపత్ అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా సంపత్ హత్యకు గురయ్యాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సంపత్‌ను హత్య చేసింది ఆయన సమీప బంధువులని తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటనపై వివరాలు వెల్లడించడంలేదు. సంపత్‌ను ఎవరు హత్య చేశారు? ఎందుకు హత్య చేశారు? అనే వివరాలు విచారణ అనంతరం వెల్లడించే అవకాశముంది.



పిచికారి విధానం:

- 2-4 మిల్లీ లీటర్ల నానోయూరియా ప్లస్‌ని లీటర్ నీటిలో కలిపి ఆకులపై, శాఖీయోత్పత్తి దశలో, 20-25 రోజుల తర్వాత రెండో సారి పిచికారి చేయాలి.
- దీర్ఘ కాల, అధిక నత్రజని అవసరమయ్యే పంటలకు అదనపు నానోయూరియా పిచికారి చేసుకోవచ్చు.

ఏ పంటలకు ఏ దశల్లో పిచికారి చేయాలి..

- వరి, మొక్కజొన్న, జొన్న పంటలో పిలక దశలో మొదట, రెండోసారి పూతకు ముందు దశలో, మూడోసారి నత్రజని అవసరాన్ని బట్టి పిచికారి చేసుకోవాలి.
- పత్తి పంటలకు మొదటి దశ శాఖీయోత్పత్తి దశలో, రెండోసారి పూతకు ముందు, కాయ ఏర్పడ్డ దశలో మూడోసారి పిచికారి చేయాలి.
- పండ్లు, పూల పంటలకు నత్రజని అవసరాన్ని బట్టి పూతకంటే ముందు కాయ ఏర్పాటు దశ, కాయ ఎదిగే దశల్లో పిచికారిలు చేసుకోవాలి.

పర్యావరణ హితం నానో యూరియా

- నేల, గాలి, నీటి కాలుష్యం నివారణ
- చీడపీడలు, తెగుళ్లు ఉధృతికి చెక్
- సంకట హరణ బీమా పాలసీ వర్తింపు
- వాడకాన్ని పెంచడానికి రైతులకు అవగాహన

మంథని, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన నానో యూరియా రైతులకు అందుబాటులోకి వచ్చింది. సాగులో యేటా పెరుగుతున్న ఖర్చులు, ప్రకృతి ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, చీడ పీడలు, తెగుళ్ల కారణంగా తగ్గిపోతున్న పంటల దిగుబడితో రైతులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రైతులకు సంజీవనిలా నానో యూరియా ఇటీవల అందుబాటులోకి వచ్చింది. నానో యూరియా ప్లస్ వినియోగంతో నేల, గాలి, నీటి కాలుష్యంతోపాటు పంటల సాగులో చీడ పీడల, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుంది. నానో యూరియా ప్లస్ జీవ సురక్షితమైన పర్యావరణానికి అనుకూలిస్తుంది. దీన్ని నిల్వ, రవాణా సులభతరం. దీన్ని వినియోగం ద్వారా రైతుల పంటలు సంకట హరణ బీమా పాలసీ పరిధిలోకి వస్తాయి. దీని ద్వారా ఏదైన విపత్కర పరిస్థితుల్లో పంట నష్ట పోతే రైతులకు బీమా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇటీవలనే వినియోగంలోకి వచ్చిన నానో యూరియా ప్లస్‌ను వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, చెరుకు, పప్పు దినుసులు, కూరగాయలాంటి వివిధ రకాల పంటల్లో వాడటం వలన కలిగే లాభాలు, ప్రయోజనాలు, దిగుబడి, ఖర్చుల ఆదా, కాలుష్య నివారణపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోజనాలు:

- నానోయూరియా ప్లస్ అనేది అన్ని పంటలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుంది. దీని పిచికారి పంటలలో నత్రజని లోపాలను సరి చేస్తుంది.
- దీని పిచికారి వలన ఎక్కువ పత్ర హరితం, మెరుగైన కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యంతో పంట దిగుబడి పెరుగుతుంది.
- అనుకూలమైన పరిస్థితుల్లో దీన్ని పోషక వినియోగ సామర్థ్యం 90 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది.
- సాంప్రదాయ యూరియా కంటే తక్కువ ధర, రైతులకు తక్కువ ఖర్చు.

ఆకులపై పిచికారి:

- నానో యూరియా ప్లస్ ఒక ఎకరాకు 250-500 మిల్లీలీటర్లు పిచికారి చేసుకోవాలి.
- స్ప్రేయర్ రకాన్ని పంట దశను బట్టి అవసరమైన నీటి పరిమాణం మారుతుంది.
- నానో యూరియా ఎకరం పంట విస్తీరానికి 4-6 ట్యాంక్‌ల స్ప్రే ద్రావణం సరిపోతుంది.
- నానో యూరియా ప్లస్ పిచికారి మిశ్రమాన్ని తయారు చేయటానికి శుభ్రమైన నీటి ఉపయోగించాలి.
- ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి.
- పిచికారి చేసిన 8 గంటల లోపు వర్షం పడితే మళ్ళీ పిచికారి చేసుకోవాలి.
- 500 ఎంఎల్, ఇఫ్‌కో సహకార సంఘాలు, పీఎంకేఎస్‌కే, విక్రయ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

ముందు జాగ్రత్తలు:

- తయారీ తేదీ నుంచి 24 నెలల్లో ఉపయోగించాలి.
- ముఖానికి మాస్క్ ధరించాలి.
- చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- పిల్లలు, జంతువులకు దూరంగా ఉంచాలి.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రూ.7700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7700, కనిష్ఠధర రూ.7650 చెల్లించి ప్రైవేట్‌ట్రేడర్స్ కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయంలో దొంగతనం

మల్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకుడు నల్ల రాజేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జగిత్యాల ఆలయంలో..

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని లింగంపేట శివారులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. దొంగలు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. గంగపుత్ర సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తెల తాడు చోరీ

జగిత్యాల క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఇంట్లో నిద్రిస్తున్న దాసరి ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి ఓ దొంగ పుస్తెల తాడును సోమవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లాడు. ఈశ్వరమ్మ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియనివ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును అపహరించుకు వెళ్లాడు. బాధితురాలి కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తొగర్రాయిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

సుల్తానాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయిలోని పురాతన శివకేశవ అంజనేయ ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ఈ సంఘటన నెలరోజుల క్రితం జరగగా సోమవారం విషయం వెలుగులోకి వచ్చిందని ఆలయ ధర్మకర్తలు, మాజీ సర్పంచ్ కర్క శంకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలోని మానేరు వాగును ఆనుకొని ఉన్న గుడిబండ వద్ద శివ పంచాయతన ఆలయంలో ఐదు విగ్రహాలు ఉంటాయి. ఈ ఐదింటిలో కొన్ని విగ్రహాలను పెకిలించి వాటికింద గుప్తనిధుల కోసంతవ్వారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దర్యాప్తు చేసి నిందితులను గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి బాపుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన సీపీ


శంకరపట్నంలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీ గౌస్ ఆలం

శంకరపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని సోమవారం సీపీ గౌస్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. నూతన పోలీస్‌స్టేషన్‌లోని స్టేషన్‌హౌస్, ఆఫీసర్ రూమ్, రైటర్ రూమ్, రికార్డుల గది, రిసెప్షన్ కౌంటర్, వెయిటింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరకోవడంతో పాత పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అద్దె భవనంలోకి మార్చినట్లు తెలిపారు. సొంత భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో సేవలు కొనసాగుతాయని, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. త్వరలో కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, వెంకట్, నిరంజన్, ఎస్ఐలు శేఖర్‌రెడ్డి, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబా


పోలీస్ డాగ్ సింబాకు బంగారు పతకం బహూకరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మమునూరు పీటీసీలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్ నుంచి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొని గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ గోల్డ్‌మెడల్ సాధించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీస్‌డాగ్‌గా సింబా ఎంపికైంది. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హాండ్లర్‌ను అభినందించారు. 2026ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీమీట్‌లో పాల్గొని మరిన్నిపతకాలు సాధించాలని రాష్ట్రానికి, రామగుండం పోలీస్‌కమిషనరేట్‌కు పేరు తీసుకురావాలని తెలిపారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ పీ కరుణాకర్, ట్రాఫిక్‌ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశం పాల్గొన్నారు.

గొర్రెల దొంగలు పట్టివేత


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ శివారులో గొర్రెలను చోరీచేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బెజ్జంకిమండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బండి అశోక్, కెంగర్ల చందు అనుమానాస్పదంగా వాహనంపై ప్రయాణిస్తున్న విషయాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఇటీవల ఇల్లంతకుంట, చందుర్తి, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గొర్రెలదొంగతనాలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు గొర్రెలు, రెండు గొర్రె పిల్లలు, ఒక పొట్టేలు, వారు ఉపయోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి గురైన మొత్తం విలువ సుమారు రూ.48వేలు. అలాగే మిగిలిన గొర్రెలను పత్రి నర్సింహులు అనే వ్యక్తికి రూ.50వేలకు అమ్మి, ఆ డబ్బును ఖర్చుచేశామని నిందితులు వెల్లడించారు. ఈ దొంగతనం కేసు చేధించిన ఎస్ఐతోపాటు, కానిస్టేబుళ్లు రవి,విశాల్, జగన్‌ను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చిన బాధిత కుటుంబం
- మందుడబ్బాను లాక్కున్న పోలీసులు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని కొందరు కబ్జాచేశారని, వారికి వత్తాసు పలుకుతున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందుడబ్బాతో వచ్చింది. అక్కడేఉన్న పోలీసులు అతడినుంచి మందు డబ్బాను లాక్కున్నారు. బాధితుడు గంగాధర మల్లేశం వివరాల ప్రకారం.. గంగాధర మండలకేంద్రానికి చెందిన గంగాధర మల్లేశం మండలంలోని సర్వే నంబరు 94లో 34గుంటల భూమిని, అదే మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎండీ గౌస్ నుంచి కొనుగోలు చేశాడు. ఆ భూమిని 2011 డిసెంబరు 27న తన భార్య గంగాధర శాంతమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆ భూమిలో కాస్తులో ఉన్నాడు. ఎండీ నజీర్ అనేవ్యక్తి అక్రమంగా తమ భూమిలో ప్రహరీ, రేకులషెడ్డు నిర్మించాడని, ఈ విషయాన్ని 2025 జూన్ 13న స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపాడు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరగా తమను లక్ష రూపాయలు అడిగినట్లు ఆరోపించాడు. అందుకు నిరాకరించడంతో అక్కత తమకు భూమి లేదంటూ భయభ్రాం తులను చేశారని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని గతనెల 27న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరాడు.


పురుగుల మందు డబ్బాతో వచ్చిన బాధితుడు గంగాధర మల్లేశం

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

- 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ.లక్ష నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు


దొంగలను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని వివిధప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగతోపాటు, దొంగిలిచిన సొత్తు కొనుగోలుచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సీపీ గౌస్‌ఆలం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లి (ప్రస్తుతం ఆర్మూర్ మండలం ఏసపల్లి)కి చెందిన టేకు చిరంజీవి(22) హార్వెస్టర్‌డ్రైవర్‌గా పనిచేసేవాడు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పథకం వేశాడు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలోని గ్రామాల్లో పగలంతా కారులో తిరిగి తాళంవేసి ఉన్న ఇళ్లను గుర్తించేవాడు. ఆ ఇళ్లను మరిచిపోకుండా ఉండేందుకు గూగుల్‌మ్యాప్ లొకేషన్ షేర్ చేసుకునేవాడు. అర్ధరాత్రి మ్యాప్ ద్వారా అక్కడికి చేరుకొని దొంగతనాలకు పాల్పడేవాడు. ఇలా జిల్లాలోని షానగర్, గంగిపెల్లి, పోరండ్ల, బొమ్మనపల్లి, చీమలకుంటపల్లి, వెల్చూర్‌గ్రామాల్లో ఏడు దొంగతనాలు చేశాడు. దొంగిలించిన సొత్తును చిరంజీవి తండ్రి గంగసాయి నిజామాబాద్ నందిపేటలో బంగారం దుకాణం నిర్వహిస్తున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నర్సయ్య(44)కు విక్రయించేవాడు. ఈ కేసులో చిరంజీవితోపాటు నర్సయ్యను అరెస్టుచేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడివద్ద నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్షరూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికిచెందిన కారు, మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్క్‌లు సీజ్ చేశారు.

నిందితుడిని పట్టుకునేందుకు కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ సీఐ గడ్డం సదన్‌కుమార్, సీసీఎస్ సీఐ ప్రకాష్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్, క్రైం పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్, సీసీఎస్ కానిస్టేబుల్ రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌తో సీపీ ప్రత్యేకటీంలను ఏర్పాటు చేశారు. రంగంలోకి దిగిన పోలీసు టీంలు దొంగతనాలు జరిగినస్థలంలో సెల్‌ఫోన్ డంపును, టోల్‌ప్లాజా సీసీకెమెరాలను పరిశీలించి చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టుచేశారు. నిందితుడి నుంచి 18తులాల బంగారం, 164తులాలవెండి, లక్ష రూపాయలనుస్వాధీనం చేసుకున్నారు.నిందితుడి కారు, మొబైల్‌ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్లు, గ్లౌస్‌లు, మాస్క్‌లు సీజ్‌చేశారు. ఈసందర్భంగా సిబ్బందిని సీపీ అభినందించారు. సమావేశంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీసీఎస్ ఏసీపీ జాన్‌నర్సింహులు, సీఐలుసదన్‌కుమార్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొళ్లపల్లి వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం గోదావరిఖని వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయాలపాలైన యువకులను పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. కారులోగల వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసి పయాజుల్ రెహమాన్ అనే వ్యక్తి ని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మరో వ్యక్తి పరారైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పయాజుల్ రెహమాన్ కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాడిగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి వద్ద 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయితో పాటు ఫయాజుల్ రెహమాన్ ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయి విక్రయించిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

తంగళ్లపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. గ్రామశివారులో స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయిస్తున్న బద్దెనపల్లి గ్రామానికిచెందిన ఎండీ సాదిక్, తంగళ్లపల్లికి చెందిన రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్ఐ ఉపేంద్రచారి, యేసయ్య, రవిందర్, కానిస్టేబుల్స్ నరేందర్, ప్రశాంత్, శ్రీకాంత్, సందీప్, అబ్బాస్ ఆలీ, రామ్మోహన్‌లను సీఐ అభినందించారు.

అక్రమ ఇసుక డంపులు సీజ్

వీణవంక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో సర్వేనం 222గల భూమిలో అక్రమంగా నిలువచేసిన ఇసుకడంపులను రెవెన్యూ అధికారులతోకలిసి పోలీస్‌లు సీజ్ చేశారు. అక్రమంగా నిలువఉన్న 96ట్రిప్పుల ఇసుకను సీజ్‌చేసినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.



మల్లాపూర్‌లోని సోమేశ్వరస్వామికి వరద పాశం సమర్పిస్తున్న భక్తులు

సోమేశ్వర కొండపై వరద పాశం

మల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోమేశ్వర కొండపై సోమవారం వరద పాశం నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన వరదపాశాన్ని తల పెట్టుకుని కొండపైకి తరలివచ్చారు. స్వామి వారికి పూజల అనంతరం వరదపాశాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా సోమేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి రంగుల పూలతో అలంకరించి శివుడికి బిల్వపత్రిని సమర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్, నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శుభలేఖ పంపండి..

శ్రీవారి దీవెనలు పొందండి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వధూవరులకు తిరుమల శ్రీవారి, అమ్మవార్ల ఆశీస్సులు అందితే అంతకంటే కావాల్సింది ఏముంటుంది.. టీటీడీ భక్తులకు ఇటువంటి అవకాశం కల్పించింది. వధూవరులు పూర్తి చిరునామాతో కూడిన వివాహ శుభలేఖను నెల రోజుల ముందు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పరిపాలనా విభాగం, కేటీ రోడ్, తిరుపతి-517501 చిరునామాకు పంపాలి. అక్కడి శుద్ధ ప్రతి విభాగం వారు శ్రీవారి అక్షింతలు, కుంకుమ, కంకణాలు, వేంకటేశ్వర స్వామి- పద్మావతి అమ్మవార్ల ఫొటోలతో కూడిన పత్రిక, కల్యాణ సంస్కృతి పుస్తకాన్ని శుభలేఖను పంపించిన వారి అడ్రస్‌కు పంపుతారు.



రాజన్న ఆలయంలో శ్రావణ శోభ

దర్శించుకున్న 50 వేల మంది భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండవ సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. సుమారుగా 50 వేల మంది వరకు భక్తులు తరలివచ్చి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు తెల్లవారుజామున ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని కోడెమొక్కు, ధర్మ దర్శనం క్యూలైన్‌లలో బారులు తీరారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా నాలుగు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు తెలిపారు. మహిళలు శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ముందు రావి చెట్టు కింద దీపాలు వెలిగించి పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండేలా దీవించమని ప్రార్థించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధా బాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్‌లు అధికారులు శ్రీనివాసచారి, రాజేందర్, నరేందర్ క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు చేపట్టారు.



ఘనంగా మహాలింగార్చన

శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదమంత్రోచ్చరణ మధ్య ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మంటపంలో మహా లింగార్చన చేపట్టారు. దీపాలను లింగాకారంలో వెలిగించిన భక్తులు మొక్కులు చెల్లించకున్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు



ధర్మపురి గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు, అర్చకులు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో...

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో సోమవారం శ్రావణ సందడి నెలకొన్నది. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వారిని ఆశీర్వదించారు.

చక్కని మొక్కల బడి

- మొక్కలు నాటిస్తూ.. మార్కులు వేస్తూ ప్రోత్సాహం
- బడి సంచి భారం తగ్గించేందుకు చర్యలు
- ఒద్యారం పాఠశాలలో నూతన ఒరవడి



ఆహ్లాదకరంగా పాఠశాల ఆవరణ



గంగాధర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఒద్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. ఎటు చూసినా మొక్కలే కనిపిస్తాయి. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులు వచ్చి బ్యాగులు తరగతి గదిలో పెట్టి మొక్కల వద్దకు వెళతారు. ఎందుకంటే వాటిని విద్యార్థులే నాటారు. వాటి సంరక్షణ బాధ్యత వారిదే.. మొక్కలు నాటి సంరక్షించినందుకు వారికి ఉపాధ్యాయులు మార్కులు వేస్తారు. ఆ పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగు భారం తగ్గింది. నిబంధనలు అనుసరించి బ్యాగు బరువును పరిమితం చేసేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆయనకు ప్రభుత్వం ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పజెప్పడంతో మండల వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించి..

ఒద్యారం పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్నారు. వాటి సంరక్షణ బాధ్యతలు వారికే అప్పజెప్పి అందుకు మార్కులు వేస్తున్నారు. దీంతో విద్యార్థులు మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని సంరక్షిస్తున్నారు. మూడేళ్ల క్రితం పాఠశాల ఆవరణలో 30 మొక్కలుండేవి. ప్రస్తుతం 280కి చేరింది. పాఠశాలలో ఆరవ తరగతిలో చేరిన ప్రతి విద్యార్థి పండ్ల మొక్కను నాటాల్సి ఉంటుంది. ఆ మొక్క శాస్త్రీయ నామం, విద్యార్థి పేరు, తరగతి, నాటిన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేస్తున్నారు.

రెండేళ్లుగా మొక్కలను పెంచుతున్న..

శాన్వి, ఎనిమిదో తరగతి



పాఠశాలలో చేరినప్పుడు జామ మొక్కలను నాటాను. ఆరో తరగతిలో నాటిన మొక్కకు నిత్యం పాఠశాల ఆటల పీరి యడ్, విరామ సమయంలో నీరు పోస్తూ, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నాను. మొక్కను నాటిన సంవత్సరం, ఎవ్వరు నాటింది, ఏ రకం మొక్క నాటారనేది ఉపాధ్యాయులు ఒక స్టిక్కర్‌లో వివరాలను నమోదు చేస్తారు. దానిని మొక్కకు కట్టిస్తున్నారు స్కాన్ చేయగానే వివరాలు మొత్తం ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి.

బ్యాగు బరువు తగ్గింది

శ్రావ్య, ఎనిమిదో తరగతి



గతంలో బడి బ్యాగు నిండా పుస్తకాలతో భారంగా ఉండే ది. ఈ విద్యాసంవత్సరం నుంచి పాఠశాల ఉపాధ్యాయులు బ్యాగు బరువును తగ్గించారు. దీంతో మెడ నొప్పి, నడుం నొప్పి పోయింది. అవసరం లేని పుస్తకాలు, నోటుబుక్స్ పాఠ శాల డెస్క్‌లో దాచిపెట్టుకుంటున్నాను.

ఆలా నాటిన ప్రతి విద్యార్థికి సంవత్సరంలో అన్ని సబ్జెక్టులకు కలిపి 10 మార్కులు కలుపుతూ ప్రోత్సహిస్తున్నారు. ప్రతి శనివారం నోబ్యాగ్ డే అమలు చేస్తున్నారు. నాలుగవ శనివారం సందేశాత్మక చలన చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు కృషితో ఈ పాఠశాలలో చదివిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సహస్ర ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైంది.

'విద్యావాహిని'తో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు

ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ప్రభాకర్‌రావు ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యావాహిని పేరుతో ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన కృషి ఫలించి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం పాఠశాలల్లో 629 మంది విద్యార్థులు చేరారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభాకర్‌రావును అభినందించారు.



పుస్తకాల సంచిని తూకం వేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు

విద్యార్థుల ఇబ్బందిని గమనించి..

ఒద్యారం పాఠశాలలో ప్రస్తుతం 97 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరూ కిలోల కొద్దీ బరువున్న పుస్తకాల సంచిని మోయలేక ఇబ్బందిపడేవారు.. చిన్న తరగతుల నుండి పెద్ద తరగతుల వరకు బరువైన బ్యాగులను మోయలేక పోయేవారు. గమనించిన ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు పుస్తకాల సంచి బరువును తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. అవసరమున్న పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లేలా.. మిగతావి పాఠశాలలోని డెస్కుల్లో పెట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం స్కూల్ బ్యాగ్ ఐదు కిలోలు మించి ఉండకూడదు. ప్రతి విద్యార్థి బ్యాగును తూకం వేయించి నిబంధనల మేరకు బరువు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభాకర్‌రావు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో గంగాధర మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో పుస్తకాల సంచుల బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభాకర్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధానంతో ప్రస్తుతం విద్యార్థులకు బ్యాగు బరువు తగ్గి శారీరకంగా ఉపసమనం లభించింది.



పచ్చని చెట్లతో పాఠశాల ఆవరణ



కరీంనగర్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంభించిన కార్యాలయాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్‌లో మంత్రి సోమవారం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ శాసనసభ్యుడిగా, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడిగా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యాలయంలో అర్జీలు, విజ్ఞాపన పత్రాలు, సీఎం సహాయనిధి, ఇతర దరఖాస్తుల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుం దన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, పడాల రాహుల్, గడ్డం విలాస్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మడుపు మోహన్, మల్యాల సుజిత్, ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, కంకణాల అనిల్‌కుమార్, ఎస్‌ఏ మోసిన్, ముద్దం తిరుపతి, ఎస్ఎల్ గౌడ్, తాళ్ళపెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల ప్రకాష్, పడిశెట్టి భూమయ్య, కట్ల సతీష్ పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో రాణించేలా

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి

చొప్పదండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్‌డీఏ, ఐఐటీ, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్‌స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్నిచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌డీఏ పోటీ పరీక్షలకు విద్యార్థులు అర్హత సాధించేలా ప్రత్యేక శిక్షణకు చొరవచూపాలని అన్నారు. ఎన్‌డీఏ శిక్షణకు సంబంధించిన, వ్యాయామ, యోగా, డ్రిల్, రన్నింగ్, వివిధ క్రీడాఅంశాలను పరిశీలించారు. కోచ్‌లు, ఆర్మీ సిబ్బందితో మాట్లాడి పలుసూచనలు చేశారు. ఆమెవెంట స్పెషల్ ఆఫీసర్ ఎం భీమయ్య, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, వైస్ ప్రిన్సిపాల్స్ కె శ్రీనివాస్, సీహెచ్ ప్రమోద్, సూపరింటెండెంట్ జె రమేష్, ఆర్మీసిబ్బంది, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైనిక్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అలుగు వర్షిణి

కాళేశ్వరం పాపాల చిట్టాను డైవర్ట్ చేసేందుకే

బీఆర్ఎస్ చలో కన్నెపల్లి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పాపాల చిట్టా బయటపడుతుండటంతో దాన్ని డైవర్ట్ చేసేందుకే బీఆర్ఎస్ చలో కన్నెపల్లి కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. సోమవారం కరీంనరగ్ జిల్లా అలుగునూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ నివేదికలో బీఆర్ఎస్ చేసిన పాపాల చిట్టా బయటపడిందన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు యదార్థముందన్నారు. కవిత తన సోదరిలాంటిదని, ఇంటి గుట్టు అంత బయటపెట్టిందని అన్నారు. వారి కుటుంబంలో అనేక సమస్యలు ఉన్నాయని, అవి వారి వ్యక్తిగత విషయమని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో చర్చిస్తా మన్నారు. వారు చేసిన పాపాలను త్వరలో ప్రజల ముందు పెడతామన్నారు. రాష్ట్రం ప్రభుత్వం రాజ్యాంగ పరంగా, చట్ట పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం చట్టం చేసి కేంద్రానికి పంపించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజరేషన్లు అమలు చేసి నిర్వహిస్తామని తెలిపారు.

జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి

మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నేత కార్మికులను, మరో వైపు ప్రభుత్వాన్ని మోసం చేసిన సిరిసిల్ల పట్టణంలోని జాగృతి మ్యాక్స్ పాలకవర్గానికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. సొసైటీ అధ్యక్షుడు కొండబత్తిని మల్లేశం, ఉపాధ్యక్షులు బొల్లబత్తి లక్ష్మీనారాయణ, కార్యదర్శి కట్ల శ్రీనివాస్, డైరెక్టర్‌లు చింతకింది సత్యం, బొడ్డు గోపాల్‌లకు మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసి ల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.



సిరిసిల్లలో నేత కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని జాగృతి మ్యాక్ సొసైటీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా స్థానిక నేతకార్మికులతో బట్టలను నేయించకుండా బయట నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా చేనేత, జౌళిశాఖ ఏడి అశోక్‌రావు మే 29, 2017న గోదాంలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 13లక్షల సరుకు ను సీజ్ చేశారు. జాగృతి మ్యాక్ సొసైటీ సభ్యులు అధిక లాభాలు పొందాలని ఓ వైపు ప్రభుత్వాన్ని మరోవైపు నేత కార్మికులను మోసం చేయడంతో గమనించిన ఏడీ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరేశ్ 10మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా పిపి సందీప్ వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు

భగత్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నాగ శరణ్య, అంజలి, వర్షిని, సుశాంత్, ఇర్ఫాన్, ఎస్.శివ వివిధ విభాగాల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం పద్మశ్రీ తెలిపారు. గత నెల 27న కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, హెచ్ఎం, పీడీ ఎల్.వెంకటరమణ, ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రావు, జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, దామోదర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

ధర్నా విజయవంతం చేయాలి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై మంగళవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా నాయకుడు రామ కృష్ణారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యా యుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో యూ ఎస్‌పీసీ ఆధ్వర్యంలో 30 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నోటీసులు ఇచ్చామని, స్పందన లేకపోవడంతో మలిదశ ఉద్యమంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

తెరుచుకోని పఠనామందిరం



మూసివున్న పఠనామందిరం

ఎలిగేడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న పఠనా మందిరం ఎప్పుడు పని చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, యువత కోసం ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట గ్రామాల్లో పఠనా కేంద్రాలను నెలకొల్పారు. అందరు చదువుకునేలా పేపర్లు, పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ నిర్వహణకు బుక్ కీపర్లను నియమించింది. ఎలిగేడులో ఉన్న పఠన కేంద్రంలో పాఠకులకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మల్లయ్యకుంట మత్తడి కాలువ పూడికతీత


పూడిక తీయిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని మల్లయ్యకుంట మత్తడి నుంచి నీలకుంట చెరువు వరకు వచ్చే కాలువలో పెరిగిన చెట్లు, వ్యర్థాలను ఎంపీవో ఆరీఫ్ హుస్సేన్ ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించి మరమ్మతు చేపట్టారు. సోమవారం ఆయన వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ మత్తడి కాలువలో ఉన్న చెట్లను, వ్యర్థాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యారత్న పురస్కారం అందజేత


ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న రాధాకృష్ణ

జ్యోతినగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విశ్వభారతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ విద్యారత్న పురస్కారానికి ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమి అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లో సోమవారం అవార్డు ఆహ్వాన పత్రాన్ని అంద జేశారు. పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు దశాబ్దాలపాటు విద్యా రంగంలో విశేష సేవలు అందించినందుకు యాదగిరిగౌడ్‌ను అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. తిరుపతిలో సెప్టెంబరు 5న నిర్వహించే బహుజన సాహిత్య అకాడమి 18వ కాన్ఫరెన్స్‌లో అవార్డును అందజేస్తామన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ


డిక్షనరీలు పంపిణీ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్

సుల్తానాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్(బాలికల) ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మూడు భాషలకు సంబ ంధించిన డిక్షనరీలను సోమవారం పంపిణీ చేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జనరల్ సెక్రెటరీ దాసరి రమేష్, శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ నిఘంటువులను బహూకరించారు. హిందీ భాషా బోధనకు కృషి చేసిన రాజన్న తదితర ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. నిఘంటువుల పంపిణీ ద్వారా విద్యార్థులు భాషపై పట్టు సాధించాలని, ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విజయ్‌రావు ఆకాంక్షించారు. సుల్తానాబాద్ హైస్కూల్, సుద్దాల యూపీఎస్, మద్దికుంట హైస్కూల్ మెరిట్ విద్యార్థులకు డిక్షనరీలు అందించారు. పీడీ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు డెస్క్ బెంచీల అందజేత

సుల్తానాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లకు దాస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ సీఈవో మల్కా యశస్వి సహకారంతో లక్ష రూపాయల విలువ గల 20 డబుల్ డెస్క్ బెంచీలు అందించారు. ముఖ్య అతిథిగా గర్రెపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని కవిత హాజరయ్యారు. గ్రామస్థులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలన్నారు. సేవా సమితి ప్రతినిధులు రవి, సాగర్‌ను సన్మానించారు. మాజీ సర్పంచ్ ఆసరి రాజయ్య, కార్యదర్శి శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రావు పాల్గొన్నారు.

నెమళ్లకు పోస్టుమార్టం


కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై మృతి చెందిన నాలుగు నెమళ్లకు సోమవారం పశు వైద్యుడు సురేష్ పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమ రవాణా

సంజయ్‌గాంధీనగర్‌లో డంప్ ● ఎక్స్‌కావేటర్‌తో రాత్రి పూట లోడింగ్ ● ఎస్కార్ట్‌ల పహారాలో తరలింపు

కోల్‌సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రామగుండంలో స్థానిక అవసరాలకు గోదావరి నుంచి ఇసుక తీసుకు నేలా కలిగిన వెసలుబాటును ఇసుక అక్రమార్కులకు వరంగా మారింది. ట్రాక్టర్ల యజమానులుగా ఉన్న కొం దరు చోటా నాయకులు ఇసుక మాఫియాకు తెరలే పారు. పగటి పూట గోదావరి నది నుంచి ఇసుక తర లించి డంప్ చేసుకుంటున్నారు. రాత్రి 9గంటల నుంచి ఎక్స్‌కావేటర్లతో లారీల్లో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఎస్కార్ట్‌తో జిల్లా సరిహద్దులు దాటిస్తు న్నారు. రోజుకు పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను తరలించి లక్షలు దండుకుంటున్నారు.

రామగుండం నియోజకవర్గంలో స్థానిక అవసరా లకు గోదావరి నుంచి ట్రాక్టర్లలో ఇసుక తీసుకునేలా వెసలుబాటు కల్పించారు. స్థానిక శాసన సభ్యుడిని ట్రాక్టర్ల యజమానులు ఈ మేరకు విజ్ఞప్తి చేయడంతో వారి ఉపాధిని దృష్టిలో ఉంచుకుని అవకాశం కల్పిం చారు. దీంతో ఇసుక రేట్లు కూడా రామగుండంలో దిగివ చ్చాయి. ట్రాక్టర్ లోడు కేవలం రూ.1200లకే లభిస్తోంది.


ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ, ఇసుక డంప్‌లు

కానీ కొందరు ట్రాక్టర్ల యజమానులు దీన్ని ఆసరాగా చేసుకుని భారీ డంప్‌లు పోగేశారు. స్థానిక సంజయ్‌గాంధీనగర్‌లోని ఒక బ్రిక్స్ ప్లాంట్‌లో కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రికి లారీల్లో లోడ్ చేస్తూ ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రోజూ పరిస్థితులను బట్టి 5నుంచి 10లారీల వరకు ఇసుక లోడ్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ లారీలకు స్థానిక నాయకుడి అనుచరులు ఎస్కార్ట్‌లుగా ఉంటున్నారు. కొన్ని రోజులుగా ఈ దందా సాగుతున్నట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో ఒక లారీ లోడ్ ఇసుకను రూ.50వేల నుంచి రూ.60వేలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. సోమవారం రాత్రి ఈ విషయం బయటకు పొక్కడంతో ట్రాక్టర్ల యజమానుల్లో కలకలం రేగింది. కొన్ని రోజులుగా ఈ అక్రమదందా సాగుతున్నా ప్రభుత్వశాఖల స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాద స్థలం వద్ద చెట్ల తొలగింపు


గూడెం, ఇందుర్తి మూలమలుపు వద్ద చెట్ల తొలగింపు

ఓదెల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇందుర్తి నుంచి గూడెం వెళ్లే మూల మలుపు వద్ద ఉన్న చెట్లను సోమవారం పొత్కపల్లి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆదివారం ఈ మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గూడెం గ్రామానికి చెం దిన మామిడి సంపత్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ ప్రాంతంలో మరో ప్రమాదం జరగకుండా ఎస్ఐ చెట్లను తొలగించారు. ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఎంలు

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండల ఏపిఎంగా శాంతి శైలజ సోమవారం విధుల్లో చేరారు. పెద్దపల్లి ఏపి ఎంగా విధులు నిర్వహించిన సంపత్ ఓదెల మండలానికి బదిలీ చేయగా కమాన్‌పూర్ మండల ఏపిఎంగా విధులు నిర్వహిస్తున్న శాంతి శైలజను పెద్దపల్లికి బదిలీ చేయగా సోమవారం విధుల్లో చేరారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధికారిగా వెన్నపురెడ్డి అనీల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శేషయ్య సూరి జూలపల్లి బదిలీ కాగా అక్కడ పని చేసిన అనీల్‌రెడ్డి మంథనికి వచ్చారు. అనీల్‌రెడ్డి గతంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడ పనిచేశారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

కోల్‌సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం గౌతమినగర్‌లోని డీఆర్‌సీసీ సెంటర్, కంపోస్ట్ యార్డ్, మల్యాపూర్ శివారులోని డంపింగ్ యార్డ్‌లను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి తడి చెత్త కంపోస్టింగ్ చేయడం వల్ల బయటకు వెళ్ళే చెత్త తగ్గుతుందన్నారు. డీఆర్‌సీసీ సెంటర్‌లో పొడి చెత్త రీ సైకిలింగ్ చేయడానికి వెళ్ళడం వలన డంపింగ్ యార్డ్‌కు కొద్ది చెత్త మాత్రమే చేరుతుందన్నారు. ఆస్తి పన్ను మదింపు, పునః


చెత్త రీ సైక్లింగ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

పరిశీలించామన్నారు. నగర పాలక సంస్థ ఆర్ఓ ఆంజనేయులు, ఆర్ఐలు శంకర్ రావు, ఖాజా, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఆర్‌పీలు, స్వశక్తి మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఓదెల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గోపరపల్లికి చెందిన పాస్టర్ బొంగోని సదయ్య గౌడ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సురేష్ (ఎలిగేడు), ప్రధా న కార్యదర్శిగా స్టాలిన్ (కొలనూర్), సహాయ కార్యదర్శి గా ఏలియా (కాసులపల్లి), కోశాధికారిగా ప్రకాష్ (కాల్వ శ్రీరాంపూర్) , సభ్యులుగా ప్రేమ్‌కుమార్ (వడకపూర్), రాజు (దుబ్బపల్లి) ఎన్నికయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిపోయిన గుడ్లు



ఓదెల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిపోయిన కోడిగుడ్లను సరఫరా చేశారు. మండల కేంద్రంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల కేంద్రాలకు పంపిణీ చేసిన గుడ్లను టీచర్లు చిన్నారులకు పంపిణీ చేశారు. వాటిని ఉడకబెడు తున్న సమయంలో పగిలిపోయి దుర్వాసన వస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి పాడైపోయిన గుడ్లను సరఫరా చేసిన కాంట్రా క్టర్లపై చర్యలు తీసుకొని, నాణ్యమైన గుడ్లను పం పిణీ చేయాలని కోరుతున్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపిస్తే కేసులు


ట్రాక్టర్‌ను పట్టుకొన్న పోలీసులు

జూలపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పెద్దాపూర్ గ్రామ పరిధిలో సోమవా రం అదే గ్రామానికి చెందిన బొజ్జ నవీన్ రహ దారిపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్‌ను నడిపిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్ ను తహసీల్దార్‌కు అప్పగించారు. ఎస్ఐ సనత్ కుమార్ మాట్లాడుతూ రహదారులను కాపా డుకోవలసిన బాధ్యత ట్రాక్టర్ యజమానులు, ప్రజలపై ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తూ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను నడిపిస్తే యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పత్తిపాక రిజర్వాయర్‌కు లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

లక్ష్మి పంప్‌హౌస్ వద్ద నిర్మించిన గాయత్రి పంప్‌హౌస్ ద్వారా శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరులోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీకి చెందిన రెండు పిల్లర్ల వరద ధాటికి కుంగిపోగా, అన్నారం బ్యారేజీ వద్ద బుంగ పడింది. సుందిళ్ల బ్యారేజీ కూడా నిర్మాణంలో లోపాలు ఉన్నా యని ఈ మూడు బ్యారేజీల్లో నీటిని నింపడం లేదు. అయినా శ్రీపాద ఎల్లంపల్లికి వచ్చిన వరదల వల్ల నీటిని మిడ్ మానేరుకు పంపింగ్ చేశారు. అయితే పత్తిపాక వద్ద 5 నుంచి 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని తరలించి జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు కరీంనగర్, చొప్పదండి, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గా ల్లోని ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలన్నా ప్రతి పాదనకు మోక్షం లభించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పత్తిపాక రిజర్వాయర్‌పై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పత్తిపాక రిజర్వాయర్‌ను నిర్మించాలని మంథనికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలిసి ప్రభుత్వం ముందుకు తీసుక వచ్చారు. దీంతో గత ఏడాది నవంబర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సహ ఎమ్మెల్యేలు, నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదిత పత్తిపాక రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించి దాని ఆవశ్యకత గురించి ప్రభుత్వానికి నివేదించారు. ఆ తర్వాత జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అప్పుడే డీపీఆర్‌కు ఆదేశించినప్పటికీ, సునిశితంగా పరిశీలించిన ప్రభుత్వం ఈ నెల 2న డీపీఆర్ తయారీకి ఉత్తర్వులు జారీ చేసింది.

● రెండు పంపు హౌస్‌లతో ప్రతిపాదనలు

పత్తిపాక రిజర్వాయర్‌పై ఆరు మాసాలుగా కసరత్తు చేస్తున్న నీటి పారుదల శాఖాధికారులు ఒక ప్రతి పాదన సిద్ధం చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ పరిధిలో గోదావరి ఒడ్డున ఉండే వెల్గటూర్ నుంచి దేవికొండ మీదుగా నీటిని పత్తిపాక వద్ద నిర్మించే రిజర్వాయర్‌లోకి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. శ్రీపాద ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ సామర్థ్యంతో చిన్న రిజర్వాయర్ నిర్మించి అక్కడ ఒక పంప్ హౌస్ నిర్మించి అక్కడి నుంచి నీటిని వెల్గటూర్ నుంచి దేవికొండ వరకు నిర్మించే గ్రావిటీ కాలువలోకి నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. అక్కడి నుంచి ఎత్తు ప్రదేశంలో ఉండే దేవికొండ వద్ద 1.10 టీఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్‌లోకి ఎత్తి పోయాలని, అక్కడి నుంచి 2 కిలోమీటర్ల దూరం పత్తిపాక రిజర్వా యర్‌లోకి నీటిని సరఫరా చేసేందుకు ఒక పంప్ హౌస్‌లోకి ఎత్తిపోయాలని డిజైన్ రూపొందించారు. అక్కడి నుంచి కాకతీయ ప్రధాన కాలువలోకి నీటిని గ్రావిటీ ద్వారా సరఫరా చేయనున్నారు. అలాగే ప్రత్యా మ్నాయంగా వరద కాలువకు వరద ఎక్కువైతే, తద్వారా పత్తిపాక రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం సీడబ్ల్యూసీ నిబంధనలు, జియాలాజికల్, బయోమెట్రీ ఆధారంగా డీపీఆర్‌ను తయారు చేయాలని ఆదేశించ డంతో అధికారులు తాత్కాలికంగా రూపొందించిన ప్రతిపాదనల్లో చేర్పులు, మార్పులు జరిగే అవకాశాలున్నాయి.

హరిహర ఆలయంలో భక్తి శ్రద్ధలతో హోమం


హోమంలో పాల్గొన్న ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్, ఆ గస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఎన్టీపీసీ పీటీ ఎస్‌లోని హరిహర దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మృత్యుం జయ, రుద్ర హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత, రాఖీ సామంత దంపతులు హాజరయ్యారు. వివిధ విభాగాల జీఎంలు, ఎన్టీపీసీ అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బోడకాకర కాయలకు డిమాండ్

మంథని, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో బోడ కాకర కాయలకు డిమాండ్ ఏర్పడింది. అడవుల్లో సహజ సిద్ధంగా లభించే బోడ కాకరకాయ రుచికి ప్రజలు ఫిదా అవుతారు. సీజన్‌లో రెండు నెలల పాటు లభిస్తాయి. మొదట కిలోకు రూ. 300 వరకు విక్రయించగా వారం క్రితం వరకు కిలో రూ.200, ప్రస్తుతం రూ. 160-180 విక్రయిస్తున్నారు. మంథని, కాటారం, మహదేవపూర్, భూపాలపల్లి, గోదావరిఖని ప్రాంతా లకు చెందిన కొందరు దళారులు నేరుగా సేకరించే వారి వద్దకు వెళ్లి తక్కువకు కొనుగోలు చేసి ఎక్కువకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న నోబెల్ పాఠశాల కరస్పాండెంట్

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి జావలిన్ త్రో పోటీల్లో పెద్దకల్వలకు చెందిన నోబెల్ హైస్కూల్ విద్యార్థిని రిషిక్‌శ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మోహన్ రాజా తెలిపారు. సోమవారం విద్యార్థిని అభినందించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన జావలిన్ త్రో 18.60 మీటర్లు త్రో చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు మోహన్‌రాజా తెలిపారు. ఈనెల 7న జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రణీత, పాఠశాల ఇన్‌చార్జి రవిందర్, పీఈటీ సురేష్ పాల్గొన్నారు.



నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


డీజీఎం అరవిందరావుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నర్సరీలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆర్జీ-2 డీజీఎం పర్సనల్ అరవిందరావుకు నర్సరీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ ఆధ్వర్యంలో డీజీఎంని కలిసిన కాంట్రాక్టు కార్మికులు సమస్యలను వివరిం చారు. సర్క్యులర్ ప్రకారం కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. సీఎంపీఎఫ్, బోనస్, వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. బ్యాంక్‌ల ద్వారా నర్సరీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, బోనస్ అమలు చేయాలని సర్క్యులర్ జారీ అయినా అమలులో జాప్యం జరుగున్నట్టు అశోక్ తెలిపారు. హరితాహారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సింగరేణి నర్సరీ కార్మికుల పట్ల నిర్లక్షం చూపుతున్నట్టు పేర్కొన్నారు. యూనియన్ సభ్యులు బుచ్చమ్మ, వనమాల, మణమ్మ, గీత, సుజాత, రమ ఉన్నారు.

రూఫ్, సైడ్స్ ప్రమాదాలపై డైరెక్టర్(పీపీ) సమీక్ష

గోదావరిఖని, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూగర్భ గనుల్లో రూఫ్, సైడ్స్ ప్రమాదాలపై సింగరేణి డైరెక్టర్ (పీపీ) కే వెంకటేశ్వర్లు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో సమావేశం నిర్వహించారు. గనుల్లో చేపట్టవలసిన రక్షణ చర్యలు, రూఫ్, సైడ్స్ ప్రమాదాలపై అవగాహన, అన్ని గనుల వద్ద అంబులెన్స్ ఏర్పాట్లు, గని ప్రమాదాలు జరిగిన వెంటనే వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్చించారు. ఉద్యోగులు రక్షణపై తగిన జాగ్రత్త చర్యలు పాటిస్తూ విధులు నిర్వహించేలా చూడాలని సూచించారు. సీరియస్ యాక్సిడెంట్ జరిగిన వెంటనే తక్షణ వైద్య సేవలు అందించేందుకు అత్యవసర డాక్టర్లను అందు బాటులో ఉంచాలని సూచించారు. ఆర్జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్, జీఎం(సేఫ్టీ) ఎస్ మధుసూదన్, ఏరియా సేఫ్టీ అధికారి సాయి ప్రసాద్, కార్పొరేట్ ఐఎస్ఓ, ప్రాంతీయ ఐఓఎస్ఓ బృందాలు పాల్గొన్నారు.

కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఈనెల 3న జరిగిన సౌత్ ఇండియా డబ్ల్యూఎఫ్ఎస్‌కెఓ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో గోదావరి ఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ కుమితి విభాగంలో ఎం.ముక్తిశ్రీ, హేమలత మహజి, ఎం.కార్తికే యన్, సాయికీర్తన, సిరాజ్, కీర్తి మమాజీ, తనుశ్రీ, శ్రీవర్షి, మోమిత్, మిథాలీ, కార్తీక, హర్షవర్ధన్‌లు బంగారు, వెండి, కాంస్య పత కాలు సాధించారు. సౌత్ ఇండియా కరాటే



పతకాలు సాధించిన ఖని విద్యార్థులు

టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన విద్యార్థు లను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటో రియో కరాటే స్కూల్ అధ్యక్షుడు తగరపు శంకర్, కార్యదర్శి ఎం.రమేష్, కోశాధికారి శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీని వాస్, శ్రావణ్‌కుమార్, నిధిష్‌కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, అభిజ్ఞ, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి గణేష్‌రాజ్, చిరంజీవి, ఆదిత్య, వంశీకృష్ణ అభినందించారు.

తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమని లయన్స్ క్లబ్ మగువ అధ్యక్షురాలు పోగుల వకుళ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమాన్‌నగర్‌లో గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరా భ్యాసం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమని, బాలిం తలు పిల్లలకు డబ్బాపాలు పట్టకుండా తల్లి పాలను పట్టాలని సూచించారు. గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచ ర్లు సువర్ణ, సునీత, స్వర్ణలత, సంధ్యారాణి, సుల్తానా, రమాదేవి పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా మండల కేంద్రంలో అంగ


ఖనిలో, ఓదెలలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

న్వాడి టీచర్ల ఆధ్వర్యంలో చిన్నారులకు అన్న ప్రాసన నిర్వహించారు. అలాగే గర్భిణులకు పోషక ఆహారాన్ని పంపిణీ చేశారు. అనం తరం తల్లిపాలు, పోషక ఆహార విలువలపై వివిధ రకాల పదార్థాలతో అలంకరించి ఉత్స వాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ బేబీ రాణి, పంజాల రమాదేవి, గడ్డం ప్రమీల, స్వరూప, కోట రమాదేవి, బీమర ఉమాదేవి, రాచర్ల సుమలత, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.